క్లుప్తంగా

స్కూల్ టు ల్యాబ్‌తో సృజనాత్మకత పెంపు



మైలవరం: స్కూల్ టు ల్యాబ్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో స్కూల్ టు ల్యాబ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మైలవరం ప్రభుత్వ పాఠశాలల నుంచి 90 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోని కంప్యూటర్ ప్రయోగశాలను సందర్శించి ప్రాథమిక అంశాలను తెలుసుకున్నారు. కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. వెంకటాద్రి విద్యార్థులకు కంప్యూటర్ ఆపరేట్ చేయడం నేర్పించారు. ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కంప్యూటర్ కోర్సులపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారి తనిఖీ

విస్సన్నపేట: మండలంలోని పుట్రేలలో మన గ్రోమోర్ సెంటర్‌లో వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందుల లైసెన్సులు, బిల్లు ఇన్వాయిస్‌లను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. పలు రకాల ఎరువుల నమూనాలను పరీక్ష నిమిత్తం పంపినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. తనిఖీలో వ్యవసాయ సహాయకులు భిక్షాలు, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చాట్రాయి: డీపీఆర్‌టీయూ 2025 క్యాలెండర్‌ను గురువారం స్థానిక మండల రీసోర్స్ కార్యాలయంలో ఎంఈఓ బ్రహ్మాచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ శాఖ అధ్యక్షుడు కె.ఏసుబాబు, ప్రధాన కార్యదర్శి టి.రామారావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు, విజయకుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ఆరు లక్షల వత్తులు

చాట్రాయి: అయోధ్యలో ప్రతి సంవత్సరం మాఘమాసంలో నిర్వహించే కోటి దీపోత్సవానికి మండలంలోని చనుబండ కోదండ రామాలయం నుంచి ఆరు లక్షల నూనె వత్తులు తరలించారు. రాజమండ్రి వాస్తవ్యులు, కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణ అప్పారావు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో అయోధ్యలో జరిగే సీతారామ కల్యాణంలో కోటి శుభలేఖలు, గోటితో ఒలిచిన తలంబ్రాల బియ్యం, హోమ సమిధలకు పూజలు చేసి గురువారం తరలించారు. స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించారు.

సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన

నూజివీడు: మీర్జాపురం, మర్రిబంధాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీఓ చెన్నా రవీంద్రనాథ్ గురువారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

ఆగిరిపల్లి: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్ కోరారు. సూరవరం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విస్సన్నపేట: వేమిరెడ్డిపల్లి తండాలో గురువారం ఎక్సైజ్ అధికారులు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వేమిరెడ్డిపల్లిలో భూక్యా లక్ష్మి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సారా తయారీకి సిద్ధం చేసిన 30 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న విస్సన్నపేటకు చెందిన మట్టకొయ్య సుధాకర్, తెల్లదేవరపల్లి తండా వాసి భూక్యా వాణి, వేమిరెడ్డిపల్లికి చెందిన భూక్యా లక్ష్మిలను అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు



చాట్రాయి: ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పోలవరం, మంకొల్లు రోడ్డు మార్జిన్లు కోతకు గురవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో రోడ్ల మార్జిన్లలోకి వెళ్లి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలు తిరుగుతుంటాయి. రోడ్లపై గుంతలు పూడుస్తామని చెబుతున్న ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చనుబండ, నరసింహారావుపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఈ రోడ్డుపై ప్రయాణాలు వాహన చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి. రోడ్లపై పడిన గుంతలను పూడ్చి మార్జిన్లకు మరమ్మతులు చేట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు పోరుబాట తప్పదా?

- కార్మికుల వేతనాలు పెంచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఇతర హామీల అమలుపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఆందోళనకు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమాయత్తం



సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: సమస్యల పరిష్కారానికి కొండపల్లి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు గతంలో 17 రోజులు సమ్మె చేశారు. సమస్యలపై అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కార్మికులు, వాహన డ్రైవర్లకు వేతనాలు భారీగా పెంచింది. మిగిలిన హామీలు అమలు చేసేందుకు సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ అడ్డుగా నిలిచింది. గత ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. హామీలు అమలు చేయని పక్షంలో పోరుబాట తప్పదని కార్మిక సంఘాల నేతలు, కార్మికులు హెచ్చరిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేతనాల పెంపు

మున్సిపల్ కార్మికుల హామీల అమలు కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. పారిశుద్ధ్య కార్మికులకు సమ్మె సమయానికి ఉన్న రూ.15 వేల వేతనానికి రూ.6 వేలు కలిపి రూ.21 వేలు చేసింది. శానిటేషన్ వాహన డ్రైవర్లకు రూ.15 వేల నుంచి రూ.24,500 వరకు పెంచింది. శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగ కార్మికులందరికీ మొదటి సారిగా రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.75 వేలు, కార్మికుడి సాధారణ మృతికి రూ.2 లక్షలు, ప్రమాద వశాత్తు మరణిస్తే రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు పెంచింది. మృతిచెందిన కార్మికుడి దహన సంస్కారాల ఖర్చులు రూ.15 వేల నుంచి రూ.20 వేల పెంపుదలకు గత ప్రభుత్వం అంగీకరించి సర్క్యులర్ ఇచ్చింది. కార్మికులపై నమోదు చేసిన పోలీసు కేసులు ఎత్తివేసేందుకు స్పష్టత ఇచ్చింది.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికుల సమ్మె కాలపు హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి కనిపించడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయడంపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. 40 ఏళ్లుగా గ్రామ పంచాయతీ స్థాయి నుంచి కార్మికులుగా పనిచేసి ఇటీవలి కాలంలో పదవీ విరమణ పొందిన కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద నయాపైసా ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. కుటుంబ పోషణకు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరినా ఫలితం శూన్యం. హామీల అమలు కోరుతూ ఇటీవల మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావుతో పాటు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు సైతం సీఐటీయూ నాయకులు, కార్మికులు వినతిపత్రం అందజేశారు. అయినా ప్రభుత్వ పెద్దల్లో ఎటువంటి స్పందన లేదు. ప్రభుత్వ వ్యవహారం ఇలాగే కొనసాగితే రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టక తప్పదని వారు సీఐటీయూ నాయకులు, కార్మికులు హెచ్చరిస్తున్నారు.

కార్మికులపై అధిక పనిభారం

సుమారు 20 వేల గృహాలు, 60 వేల జనాభాతో 29 వార్డులుగా కొండపల్లి మున్సిపాల్టీ 2020లో ఏర్పడింది. అరకొర కార్మికులతో వేల సంఖ్యలో ప్రజలకు పారిశుద్ధ్య సేవలు అందించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. మున్సిపాల్టీలో 250 మంది కార్మికులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 180 మంది విధులు నిర్వహిస్తున్నారు. దీనితో కార్మికుల పనిభారం పడింది. కార్యాలయంలో కూడా సరిపడా ఉద్యోగులు లేరని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్వయంగా వెల్లడించారు.

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి



గత ప్రభుత్వం పురపాలక కార్మికులకు ఇచ్చిన సమ్మె హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదు. గత ప్రభుత్వం వేతనాల పెంపుతో పాటు ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్ తదితర హామీల అమలుకు అంగీకారం తెలిపింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా హామీల అమలుపై స్పందన లేదు. సమ్మె కాలపు హామీలు తక్షణం అమలు చేయాలి.

– ఎం.మహేష్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి, కొండపల్లి

కుటుంబాన్ని ఎలా పోషించాలి



కొండపల్లి గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాల్టీ వరకు 40 ఏళ్లు పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేశా. వరదలు, కరోనా సమయాల్లో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించా. నాలుగు నెలల కిందట రిటైర్ అయ్యా. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇక నుంచి కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియడం లేదు. కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ అమలు చేయాలి.

– సాలి రాము, రిటైర్‌మెంట్ కార్మికుడు

హామీలు అమలు చేయాలి

నూజివీడు: నూతన సంవత్సరంలో హిందూ శంఖారావ సభ జరపాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పార్టీలు అధికారంలోకి రావటానికి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శంఖారావ సభకు వచ్చే హిందువులు నూతన సంవత్సరంలోనైనా మీరిచ్చిన హామీలను అమలు చేయకుంటే నిలదీస్తామని పాలకులను హెచ్చరించాలని హరినాథ్ కోరారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసేలా ఒత్తిడి ఎందుకు చేయరని చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నాయకులను నిలదీయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మైలవరం: మైలవరం నియోజకవర్గానికి సంబంధించి 56 మంది లబ్ధిదారులకు 34.92 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, మరో ఐదుగురికి రూ.9.30 లక్షల విలువైన ఎల్‌ఓసీలును మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అనతి కాలంలోనే సాయం మంజూరైందన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నూజివీడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు, అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయండి



తిరువూరులో మాట్లాడుతున్న ఎంఈఓ రామకృష్ణ

తిరువూరు: పాఠశాల యాజమాన్య కమిటీలు తమ పిల్లలు చదివే పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని తిరువూరు ఎంఈఓ సీహెచ్ రామకృష్ణ కోరారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీల బాధ్యతలు, విధులపై ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్లకు ఒక రోజు శిక్షణా తరగతి నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన విద్య అందించేందుకు సామాజిక పరమైన సహకారం ఎంతో అవసరమని ఎంఈఓ వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎస్ రాజు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

- గంపలగూడెం: ఎస్ఎంసీ చైర్మన్లు తమ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యాబోధన తీరును సైతం ఎస్ఎంసీ చైర్మన్లు పర్యవేక్షించాల్సి ఉందన్నారు. రిసోర్స్ పర్సన్స్ కోట శ్రీనివాసరావు, లక్ష్మణ్, డి. ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం కిరణ్, పలువురు ఎస్ఎంసీ చైర్మర్లు, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.
- మైలవరం: ప్రభుత్వ పాఠశాలల పని తీరును పాఠశాల యాజమాన్య కమిటీలు (ఎస్ఎంసీ) ద్వారా ప్రజలకు తెలియజేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఎల్. బాలు అన్నారు. మైలవరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. కాంప్లెక్స్ చైర్మన్ ఎస్. సతీష్, చంద్రాల ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులకు ఇబ్రహీంపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ సీహెచ్ పుష్పలత, ఎమ్ఈఓ2 పి.శ్యామ్‌బాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.
- ఆగిరిపల్లి: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర కీలకంగా ఉండాలని ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్ సూచించారు. ఆగిరిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.
- చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై పాఠశాలల యాజమాన్య కమిటీ పర్యవేక్షణ ఉండాలని ఎంఈఓ బ్రహ్మాచారి అన్నారు. గురువారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాలల యాజమాన్య కమిటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు ఏవీ వెంకటేశ్వరరావు, జయరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ముసునూరు: ముసునూరు హైస్కూల్ ప్లస్‌లో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు, ఇన్‌చార్జి హెచ్ఎం వాణీకుమారి, పలు పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీల సభ్యులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల తన్నులాట

- టీడీపీలో రెండు వర్గాల మధ్య ఫ్లెక్సీ వివాదం
- పోలీసుస్టేషన్ సాక్షిగా బాహాబాహీకి దిగిన రెండు వర్గాలు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరింది. నాలుగు వర్గాలుగా ఉన్న తెలుగుదేశం పార్టీలో నాయకుల ఆధిపత్య పోరుతో నిత్యం వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల సాగునీటి సంఘాల ఎన్నికల్లో వర్గపోరుతో అసంతృప్తి నేతలు మైలవరం టీడీపీ కార్యాలయం సాక్షిగా బలప్రదర్శన చేసిన ఘటన మరువక ముందే జి.కొండూరు మండల పరిధి సున్నంపాడులో మరో ఘటన గురువారం వెలుగు చూసింది. గ్రామంలో ఇటీవల టీడీపీలో చేరిన నాయకులు, గతంలో టీడీపీలో కొనసాగుతున్న నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. వివరాలలోకి వెళ్తే.. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గ్రామంలో టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీపై మరో వర్గానికి చెందిన జగ్గరాజు అలియాస్ బంటి అనే వ్యక్తి బుధవారం రాత్రి రాయి విసిరాడు. ఈ క్రమంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వర్గానికి చెందిన కంభంపాటి వెంకటేశ్వరరావు, హేమ నర్సింహారావు జగ్గరాజుపై దాడి చేశారు. ఈ పంచాయతీ గురువారం జి.కొండూరు పోలీసుస్టేషన్‌కు చేరింది. అయితే ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునేందుకు వచ్చి జి.కొండూరు పోలీసుస్టేషన్‌లో బాహాబాహీకి దిగారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాల నాయకులను తమదైన శైలిలో అదుపు చేశారు. అనంతరం ఫ్లెక్సీపై రాయి విసిరిన వ్యక్తితో పాటు అతనిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

10 లీటర్ల సారా స్వాధీనం

ముసునూరు: ముసునూరులో అనగాని రాంబాబు ఇంటి వద్ద గురువారం సోదాలు చేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని నూజివీడు కోర్టుకు రిమాండ్‌కు తరలించారు.

అన్యాక్రాంతమైన భూములు ఇప్పించాలని వినతి

ఇబ్రహీంపట్నం: కేతనకొండ గ్రామంలో అన్యాక్రాంతమైన ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన భూములను తిరిగి తమకు ఇప్పించాలని గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేతనకొండ పరిధిలోని జమీ నవేపోతవరంలో ఎస్సీ సామాజిక అభివృద్ధికి 1976లో 32 కుటుంబాలకు 32 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. అప్పట్లో నిరక్షరాస్యులైన తమ పూర్వీకుల నుంచి కొందరు పెత్తందారులు తప్పుడు పత్రాలతో భూములు అక్రమంగా స్వాధీనం చేసుకుని రికార్డులు మార్పు చేసుకున్నారన్నారు. జీవనోపాధి కోసం నిరుపేదలమైన మాకు మరలా ఆ భూములు ఇప్పించాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ చెప్పారు. లబ్ధిదారులు, వారి వారసులు అయిన ఉప్పులూరి ఏసురత్నం, పులి బాబు, మంద పుల్లయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెంలో ‘కిశోరి వికాసం’

గంపలగూడెం: పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, పిల్లలు ఏదైనా తప్పటడుగులు వేస్తుంటే సరిచేసి మంచి ప్రవర్తన నేర్పించడం ద్వారా వారి జీవితానికి బంగారుబాట వేయాలని ఎంపీడీఓ పీవీఎస్ నాగేశ్వరరావు అన్నారు. గంపలగూడెం వెలుగు కార్యాలయంలో గురువారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యారులు చదువుపై ఆసక్తి కనపర్చేలా చూడాలన్నారు. ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్ట్ అధికారి సత్యవతి మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల వయస్సుగల బాలికల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. గంపలగూడెం పీహెచ్‌సీ వైద్యులు భార్గవి మాట్లాడుతూ నిర్ణీత వయస్సులో వచ్చే మార్పుల గురించి పిల్లల్లో పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, ఏపీఎం గురవయ్య, న్యాయవాది కిరణ్, ఐసీడీఎస్ గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు సెక్టార్ల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- గోదాదేవికి సారె సమర్పణ



ఊటుకూరు(గంపలగూడెం): ధనుర్మాసం 18వ రోజు కార్యక్రమాలను గంపలగూడెం, ఊటుకూరు, పెనుగొలను రామాలయాల్లో, నెమలి వేణుగోపాల స్వామి, పెద్దకొమిర వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో మహిళలు తిరుప్పావై పఠనం చేశారు. ఊటుకూరు కోదండ రామాలయంలో గోదాదేవి అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. పెద్దకొమిర వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు గోదాదేవికి సారె సమర్పించారు.

- విద్యార్థులకు దుప్పట్ల అందజేత

గంపలగూడెం: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు 40 మందికి గంపలగూడెం హైస్కూల్ హెచ్ఎం బి. కిరణ్ సౌజన్యంతో గురువారం దుప్పట్లు, పెన్సిల్ బాక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, పాఠశాల హెచ్ఎం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- రేపు హుండీ కానుకల లెక్కింపు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను శనివారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. గడచిన రెండు నెలల 17 రోజులకు సంబంధించిన కానుకలను ఈ విడత లెక్కిస్తామన్నారు.

- ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

నెమలి(గంపలగూడెం): నెమలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సముద్రాల పాపమ్మ, గుర్నాథం మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సముద్రాల సత్యనారాయణ 170 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను గురువారం అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ మందా జమలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- హైందవ శంఖారావంపై ప్రచారం

తిరువూరు: విజయవాడ సమీపంలో 5న జరుగనున్న హైందవ శంఖారావం సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం తిరువూరులో ప్రచారం నిర్వహించారు. తిరువూరు ప్రాంతం నుంచి తరలివెళ్ళే వారి కోసం 25 ప్రత్యేక బస్సులను ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఏర్పాటు చేశామన్నారు.

- ఆరుతడి పంటలపై అవగాహన

మైలవరం: ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ టి. మాధవీలత అన్నారు. మైలవరం రైతు శిక్షణా కేంద్రంలో మైలవరం డివిజన్ గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

- ‘ఉల్లాస్’పై సమావేశం

నూజివీడు: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ పేర్కొన్నారు. ఉల్లాస్ కార్యక్రమంపై స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వీఓఏలకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వెలుగు ఏసీ డీటీ సుందరరావు, ఏపీఎం పి.ప్రసాద్, ఏపీఓ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

- నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: స్థానిక పురపాలక సంఘంలో మెప్మా ఆధ్వర్యంలో హోమ్ ట్రి యాంగిల్ సంస్థ ద్వారా వివిధ రంగాల్లో అనుభవం ఉన్న వృత్తిదారులకు శిక్షణ ఇవ్వనున్నామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్లు, పెయింటర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీ, గీజర్, బ్యూటీషియన్, మెకానిక్‌లు ఈ నెల ఐదో తేదీలోగా మెప్మా కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమోదుకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలతో మెప్మా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 79016 10196, 75690 49678 నంబర్లను సంప్రదించాలన్నారు.

- సావిత్రిబాయి పూలేకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో గురువారం సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి శ్రీలత మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గొప్పతనాన్ని, సమాజానికి ఆమె చేసిన సేవలను వివరించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- నగదు బహుమతుల ప్రదానం

రమణక్కపేట (ముసునూరు): ప్రతిభ కనబరుస్తున్న పల్లె విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ కొండా దుర్గా భవాని అన్నారు. రమణక్కపేట హైస్కూల్‌లో హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన గురువారం ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నావళి ఫౌండేషన్ చైర్మన్ ఆముదాల కాంతారావు ఆధ్వర్యంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఈ ఏడాది విద్యలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు బహుమతులను అందించారు.

- దాడి ఘటనపై ఇరువర్గాలపై కేసులు

నూజివీడు: మండలంలోని మర్రిబంధానికి చెందిన దోనవల్లి వెంకట్రావు (50)పై గతంలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేసి సస్పెండ్ అయిన దావులూరి ప్రభావతి, ఆమె కుటుంబ సభ్యులు కలిసి బుధవారం దాడి చేశారు. ఇంటి దగ్గర ఒక్కడే ఉన్న వెంకట్రావు నీళ్లు అయిపోవడంతో నీళ్లు వదిలేందుకు మంచినీటి ట్యాంకు వద్దకు వెళ్లగా అక్కడ ప్రభావతి, ఆమె తండ్రి దావులూరి రంగారావు, ఆమె సోదరుడు దావులూరి ప్రభుకుమార్ దాడి చేసి కొట్టడంతో గాయపడిన వెంకట్రావును 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తనతో దోనవల్లి వెంకట్రావు అసభ్యకరంగా మాట్లాడుతూ అనుచితంగా ప్రవర్తిస్తూ తనపై దాడి చేశాడని దావులూరు ప్రభావతి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దావులూరు ప్రభావతి గతంలో కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ బ్యాంకులో తాకట్టు పెట్టిన దాదాపు 350 గ్రాముల బంగారాన్ని కొట్టేసిన కేసులో ఉద్యోగం నుంచి సస్పెండ్ అయింది. అనంతరం సొంతూరులో అనేక వివాదాలకు కారణమవుతుండటంతో రూరల్ పోలీసులు ప్రభావతిపై రౌడీషీట్ తెరిచారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారు.

- పీఏసీఎస్ కార్యదర్శిపై దాడికి ఖండన

ఇబ్రహీంపట్నం: ఈలప్రోలు పీఏసీఎస్ కార్యదర్శి పవన్ కుమార్‌పై డిసెంబర్ 28న దాడి చేసిన బత్తుల శ్రావణ్‌పై చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సంఘాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం కోఆరేటివ్ బ్యాంక్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ దాడికి నిరసగా శుక్రవారం ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలపాన్నారు. జిల్లాలోని సహకార సంఘాలు అన్నీ శనివారం మూసివేసి ఈలప్రోలు గ్రామంలో నిరసన తెలిపేందుకు హాజరు కావాలని కోరారు.